## సిలికాన్ వేలీలో అన్నమయ్య






మొదటగా సుమారు 40 మంది కళాకారులు గోష్ఠిగానంలో అన్నమాచార్యుని 7 ప్రముఖ రచనలతో నిండిన సప్తగిరి సంకీర్తనలతో వీనులవిందు చేశారు. అటుపై ప్రవాసంలో ఉన్న 318 మంది గాయనీగాయకులు, నర్తకీ నర్తకులు, వాద్యకారులు ఒక్కొక్కరుగా, బృందాలుగా వేలాది అన్నమయ్య కీర్తనల్లో తమకు నచ్చిన గీతాలను తమదైన శైలిలో ఆలాపించి ప్రేక్షకులను మైమరపింపచేశారు. కాలిఫోర్నియా రాష్ట్రంలోని పలు ప్రదేశాల నుండి విచ్చేసిన 1500 పైగా ప్రేక్షకులు హరినామ సంకీర్తనా సుధలను అందించినందుకు భావమునందు, బాహ్యమునందు సిలికానాంధ్ర కార్యకర్తలకు కృతజ్ఞతలందించారు. అన్నమయ్య పదాలకు అనుగుణంగా నర్తించినా, గీతాలను ఏ శైలిలో ఆలాపించినా రసమయలోకాల్లో విహరించి ఆ పదాలలో ఉన్న మాధుర్యాన్ని ఆసాంతమూ ఆస్వాదించారు సిలికాన్ వేలీలో తెలుగువారు.

నాటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు కె.వి. రమణాచారి ఆశీ: పూర్వక ప్రసంగం చేస్తూ 'అన్నమయ్య కరుణామృతం వర్షిస్తే అది ప్రథమంగా సిలికానాంధ్ర కోసమే అవుతుంద'ని ప్రేక్షకుల చప్పట్ల నడుమ అన్నారు. సిలికానాంధ్ర సాంస్కృతిక రంగంలో చేస్తున్న కృషిని అభినందిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంక్షించారు.


సిలికానాంధ్ర